# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-10-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఈరోజు సమావేశమవుతారు.**

2. **ఉన్నత విద్యా విధానం 2026, విద్యా చట్ట సవరణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.**

3. **క్షయ నిర్మూలనకు ప్రభుత్వం, సమాజం సమష్టిగా కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు.**

4. **యువతలోని నైపుణ్యం, ప్రతిభే తెలంగాణకు అతిపెద్ద వనరులని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీలో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో నిన్న రాత్రి సమావేశమయ్యారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టు, జిల్లాల వారీ కార్యాచరణ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో కేంద్ర, రాష్ట్ర వాటాలపైనా చర్చించారు. కాగా, ఈరోజు పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో చంద్రబాబునాయుడు సమావేశమవుతారు. ఈ సందర్భంగా విశాఖ మెట్రో, బీచ్ కారిడార్ ప్రాజెక్టులకు ఆమోదంతో పాటు నదుల అనుసంధానం, కరవు నివారణకు కేంద్ర సహాయం కోరనున్నారు. అనంతరం పలువురు కేంద్ర మంత్రులతోనూ ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు.

-----------------------

రాష్ట్రంలో విదేశీ, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యా సంస్థల ఏర్పాటు కోసం రూపొందించిన ఉన్నత విద్యా విధానం-2026 విద్యా చట్ట సవరణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిన్న జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సమాచార, ప్రజా సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి పాత్రికేయులకు వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని అభినందిస్తూ.. రాష్ట్ర మంత్రివర్గం ఏకగ్రీవ తీర్మానం చేసిందని తెలిపారు. 'తల్లికి వందనం' పథకానికి 10 వేల 208 కోట్ల రూపాయల కేటాయింపుతో పాటు వసతి గృహాలు,

గురుకులాల డైట్ ఛార్జీలను 10 శాతం పెంపు వంటి నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని మంత్రి వివరిస్తూ,

వాయిస్ ..30. సెకన్లు

---

క్షయ నిర్మూలనకు ప్రభుత్వం, సమాజం సమష్టిగా కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. విజయవాడలోని లోక్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో 77వ టీబీ సీల్ విక్రయ కార్యక్రమాన్ని గవర్నర్ నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్షయ నియంత్రణలో గణనీయమైన పురోగతి సాధించినప్పటికీ, ఈ వ్యాధి ఇప్పటికీ ప్రాణాంతకంగానే ఉందని పేర్కొన్నారు. 2030 నాటికి క్షయవ్యాధి నిర్మూలన లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'టీబీ ముక్త్ భారత్ అభియాన్'ను ప్రభుత్వం, ప్రజలు సమష్టిగా కృషి చేసి విజయవంతం చేయాలని గవర్నర్ కోరారు.

---

కృత్రిమ మేధతో ప్రయోజనాలు ఉన్నప్పటికీ... భవిష్యత్తులో దాని వల్ల తలెత్తే సమస్యల నివారణకు ఐటీ నిపుణులు కృషి చేయాలని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా సూచించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 27వ స్నాతకోత్సవంలో ఆయన నిన్న ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మనిషి అందించిన డేటా ఆధారంగానే కృత్రిమ మేధ అభివృద్ధి చెందుతోందని అన్నారు. మారుమూల ప్రాంతాలు, ఆదివాసీలకు దూర విద్యను అందించడంలో అంబేద్కర్ విశ్వవిద్యాలయం చేస్తున్న కృషిని గవర్నర్ ప్రశంసించారు.

---

విద్యుత్ ఉద్యోగుల కుటుంబాల సంక్షేమం కోసం అర్హులైన వారికి నాలుగు నెలల్లోనే కారుణ్య నియామక ఉత్తర్వులు ఇస్తున్నామని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఏపీ జెన్‌కో సంస్థలో మృతిచెందిన ఉద్యోగుల కుటుంబాలకు చెందిన 27 మందికి అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి నిన్న నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,

వాయిస్...27 సెకన్లు

---

ఆంధ్రప్రదేశ్‌ను పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. స్పెయిన్‌లోని సెవిల్లెలో జరుగుతున్న 'టూరిజం ఇన్నోవేషన్ సమ్మిట్-2026'లో పాల్గొన్న మంత్రి... ఎక్స్‌ప్లర్జర్ సంస్థ రూపొందించిన 'నివు ఏఐ'ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని వందకుపైగా పర్యాటక ప్రాంతాల్లో కృత్రిమ మేధ ఏఐ స్మార్ట్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. క్యూఆర్ కోడ్ ద్వారా 130కి పైగా భాషల్లో పర్యాటక ప్రాంతాల సమాచారం తెలుసుకునే అవకాశం కల్పిస్తామన్నారు.

---

గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ అందించి స్థిరమైన ఉపాధి కల్పించడమే దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన-2.0 లక్ష్యమని కేంద్ర, రాష్ట్ర అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్–సీడాప్ ఆధ్వర్యంలో కౌశల్య యోజనపై దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు పలు రాష్ట్రాలకు చెందిన అధికారులు, శిక్షణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. నైపుణ్య శిక్షణ, మూల్యాంకనం, అభ్యర్థుల ఎంపిక, ఉపాధి కల్పన, అనంతర పర్యవేక్షణ వంటి అంశాలపై కార్యశాలలో చర్చించారు.

–––––––––––––––––––––––––

ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనా ప్రస్థానానికి 25 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నిర్వహించిన 'వికసిత్ భారత్ సంకల్ప సభ'లో పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి నిన్న పాల్గొన్నారు. సుమారు 2 వేల మంది విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో పురందేశ్వరి మాట్లాడుతూ,

వాయిస్ ..30.. సెకన్లు

–––––––––––––––––––––––––

యువతలోని నైపుణ్యం, ప్రతిభ, ప్రపంచస్థాయి పోటీతత్వమే తెలంగాణకు అతిపెద్ద వనరులని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన డీఈ షా ఇండియా 30వ వార్షికోత్సవ వేడుకల్లో మంత్రి నిన్న పాల్గొని ప్రసంగించారు. యువత ప్రతిభ కారణంగానే హైదరాబాద్ సాంకేతికత, ఆవిష్కరణలు, ఆర్థిక సేవలు, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు ప్రముఖ గమ్యస్థానంగా ఎదుగుతోందని తెలిపారు. ప్రపంచ సంస్థలు కేవలం తమ కార్యకలాపాలను నిర్వహించే ప్రదేశంగా కాకుండా.. కొత్త ఆవిష్కరణలు, భవిష్యత్ సాంకేతికతల అభివృద్ధికి తెలంగాణను కేంద్రంగా ఎంచుకునేలా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.

–––––––––––––––––––––––––

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా వ్యాజ్య విధానం–ఏపీ స్టేట్ పబ్లిక్ లిటిగేషన్ పాలసీ విధివిధానాల ఖరారుపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న సమావేశమైంది. మంత్రులు ఎన్ఎండి ఫరూక్, నాదెండ్ల మనోహర్, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, వై.సత్యకుమార్ యాదవ్ సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలపై న్యాయశాఖ అధికారులు మంత్రివర్గ ఉపసంఘానికి వివరించారు.

–––––––––––––––––––––––––

ఆంధ్రప్రదేశ్, యానాం ప్రాంతాల్లో దిగువ ట్రోపో ఆవరణంలో ఆగ్నేయ, నైరుతి దిశల నుంచి గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో రానున్న రెండు రోజుల పాటు అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

మరోవైపు తెలంగాణలోని పలు జిల్లాల్లో ఈరోజు ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది.

====================